


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## శుభ జ్యోత్స్న

**"శృతీ నేను వచ్చేసా" ఆఫీస్ నుంచి రాగానే** భార్య దగ్గరకి వస్తూ ఉత్సాహంగా అరిచాడు కృష్ణ.

"దూరం.. దూరం." తనూ అదే స్థాయిలో అరిచింది శృతి.

"అబ్బా! మళ్ళీ ఏమైంది?"

"ఏమీ కాలేదు. మీరు స్నానం చేసి రావాలి అంతే." సన్నగా నవ్వుతూ చెప్పింది.

ఆ మాట వినగానే అతని మొహంలో చిరాకు కనిపించింది.

"నాకు చిన్నప్పటి నుంచీ సాయంత్రాలు స్నానం అలవాటు లేదంటే వినవే?" విసుక్కున్నాడు.

"ఓహో! మరి అమ్మాయిలని ముద్దుపెట్టుకోవడం అలవాటేం?"

"అలా వేలికేస్తే మెడకేసి ఎందుకు శృతీ టార్చర్ చేస్తావు? ఇవ్వాళ నేను ఆఫీస్‌లో ఒక అద్భుతమైన ఆలోచన చేసాను తెలుసా? అది వినగానే నువ్వు ఎగిరి గంతేసి అమాంతం నన్ను ముద్దుపెట్టేసుకుంటావ్" ఊరిస్తున్నట్లు చెప్పాడు.

"అంత అద్భుతం ఏమిటబ్బా?" సాలోచనగా అడిగింది శృతి.

"నీకసలు తట్టదు తెలుసా? అదేంటంటే నా పేరు కృష్ణ, నీ పేరు శృతి కదా? మనకి పాప పుడితే కృతి అని పేరు పెట్టచ్చు" గర్వంగా చెప్పాడు.

"మరి అబ్బాయి పుడితేనో? తిష్ణా?" అమాయకంగా అడిగింది శృతి.

"రాక్షసీ... ఎదుటివాడి తెలివితేటలని ఒప్పుకోవు" అలిగి కూర్చున్నాడు కృష్ణ.

"పాపం! దగ్గరకి వచ్చి ఓదార్చుదామంటే స్నానం చేయలేదు. దూరం నుంచే సానుభూతిగా చూస్తాలెండి" నవ్వు ఆపుకుంటూ చెప్పింది.

"మళ్ళీ స్నానమా? నాకు చిన్నప్పటి నుంచీ అలవాటు లేదు." గట్టిగా అరిచాడు.

"మీరు చిన్నప్పుడు ఆడుకునేవారు కాదా? అంటే స్కూల్ అయ్యాక."

"ఎందుకు ఆడుకోలేదు? రాత్రి ఏడింటిదాకా ఆడుకునే ఇంటికి వెళ్ళేవాడిని."

"ఐనా స్నానం చెయ్యకుండానే పడుకునేవాళ్ళా? నిద్రెలా పట్టేది?"

"మేము అద్దె ఇంట్లో ఉండేవాళ్ళం. ఓనర్ నీళ్ళు ఎక్కువ ఖర్చు చేస్తే తిట్టేవాడు. అందుకని మా అమ్మ బలవంత పెట్టేది కాదు. అయినా అలసిపోయి హాయిగా నిద్రపోయేవాడ్ని."

"రొచ్చు కంపుతోనా?"

"ఛీ! ఆమాటేంటి? గేదలు కదా రొచ్చు కంపు వచ్చేది? నేను దూడ అనుకున్నావా?" చిన్నబుచ్చుకున్నాడు.

"మట్టిలో ఆడితే మనుషులలా వస్తారు. సరే కానీ మీకు మంచి సేలరీతోనే ఉద్యోగం వచ్చింది కదా? ఇంట్లో బోలెడు నీళ్ళు, గంగ కావేరి అనుకోండి. మరి అప్పుడు అలవాటు చేసుకోవచ్చుగా?"

"ఎందుకు అనవసరంగా? కార్లో ఏ.సి, ఆఫీస్‌లో ఏ.సి. అసలు చెమట పట్టదు తెలుసా?"

మళ్ళీ ఆమె దగ్గరగా వస్తూ చెప్పాడు.

రెండడుగులు వెనక్కి వేసి చెప్పింది శృతి.

"ఒంటికి ఆహారం ఎంత ముఖ్యమో శుభ్రం కూడా అంతే ముఖ్యం. రాత్రి ఎలా అన్నం తింటారో అలా స్నానం చెయ్యాల్సిందే మరేం ఫర్వాలేదు. ఆల్కాహల్, సరసాలు అలవాటు చేసుకున్నట్లే శుభ్రత కూడా అలవాటు చేసుకోండి."

"నువ్వు మరీ శుభ్ర జ్యోత్స్నవైపోయావు శృతీ" కినుకుగా చెప్పాడు.

గలగలా నవ్వింది శృతి. ఆరాధనగా చూసాడు కృష్ణ.

"శుభ్రజ్యోత్స్నలో శుభ్ర అంటే మన తెలుగు శుభ్రం కాదు. బెంగాలి శుభ్రం, అంటే తెల్లని, స్వచ్ఛమైన అని అర్థం. జ్యోత్స్న అంటే వెన్నెల. యామిని అంటే రాత్రి. 'శుభ్రజ్యోత్స్న పులకిత యామినీ' అంటే, తెల్లని వెన్నెల్లో రాత్రిపులకించిపోయింది అని అర్థం."

"రెండు సందేహాలు శృతీ. ఒకటి. నీకు బెంగాలీ భాష వచ్చా? రెండు అది జాతీయ గీతం కదా ఈ ప్రకృతి వర్ణనేమిటి?"

"రెండు సమాధానాలు కృష్ణా. ఒకటి నాకు బెంగాలీరాదు. కొంచెం సంస్కృతం వచ్చు. రెండు మన మాతృదేశం ఇలా రమణీయంగా అలరారుతుందని కవి భావన. సరేనా? ఇక పదండి."

అతన్ని బాత్ రూములోకి తోసింది శృతి.

●●●

"కృష్ణా మీకొక అద్భుతం చూపించనా?"

"ఏమిటి?" ఆసక్తిగా అడిగాడు కృష్ణ.

"ఇలా రండి" అతని చేతిని పట్టుకుని వాష్ బేసిన్ దగ్గరికి తీసుకెళ్ళింది. ఓ పేపర్ నేప్కిన్ తీసుకుని అందులో రాలిన వెంట్రుకలు, పేస్టలని శుభ్రంగా తుడిచి, దాన్ని డస్ట్‌బిన్‌లో పడేసి చేతులు కడుక్కుంటూ వాష్ బేసిన్‌ని చూపించి చెప్పింది.

"ఇదే ఆ అద్భుతం."

"ఇదా?"" తెల్లమొహం వేసాడు కృష్ణ.

"అద్భుతం అంటే భూతకాలంలో జరగనిది అని. మరి నిమిషం క్రితం ఎలా ఉందిది? మీకు చక్కటి చుక్కల్లాంటి కళ్ళున్నాయి. మంచి తీక్షణమైన చూపుంది. అది దుస్తుల్లోంచే ఆడవారి అందాలని చూడగలదు. మరి వాష్ బేసిన్‌లో మీరు చేసిన ఆగం మీకు కనపడలేదా? మీ తర్వాత ఇంకొకరు దాన్ని ఎలా ఉపయోగిస్తారు? చిన్న పేపర్ నేప్కిన్, ఒక్క అరనిమిషం సమయంతో దాన్ని యధాప్రకారం ఉంచచ్చు కదా? మన ఇంట్లోనే మనం ఇలా ఉంటూ, రైళ్ళల్లో నీట్‌నెస్ గురించి విమర్శిస్తాం ఎందుకు?"

సమాధానం చెప్పలేక మూగగా ఉండిపోయాడు కృష్ణ.

●●●

"కృష్ణా! మన బెడ్‌ని దేంతో చేసారు? "

"ఫోమ్‌తో? ఏం తల్లీ మళ్ళీ ఏం జరిగింది?"

"అది తడి పీల్చుకుంటుందా?"

"యా! దాని లక్షణమే అది."

"మరి దాన్ని ఉతకొచ్చా?"

"ఛీఛీ! నీ శుభ్రాలతో చంపుతున్నావ్ శృతీ. పరుపుని ఉతుకుతారా ఎవరైనా?" చిరాకుపడ్డాడు.

"అది ఈ జన్మకి ఆరదు."

"మరి వాసన వస్తే ఏం చెయ్యాలేం?

"వాసన ఏంటి మహా తల్లీ? రోజూ స్నానం చేసాకే కదా మంచం ఎక్కుతున్నాను.?"

"మరి తడి టవల్‌ని మంచం మీద వేస్తున్నారు. అది హాయిగా తడి పీల్చుకుంటోంది. మీరు చెప్పినట్లు ఈ జన్మకి ఆరదు. దాంతో కంపు కొడుతుంది. మరి అప్పుడు ఉతక్కపోతే ఎలా కృష్ణా?" అమాయకంగా అడిగింది.

చదువుతున్న పేపర్ పక్కన పడేసి లేచి వేగంగా బెడ్‌రూంలోకి వెళ్ళి దానిమీద ఇందాక తను పడేసిన తడి టవల్‌ని బాల్కనీలోకి తీసుకెళ్ళి ఆరేసి వచ్చాడు.

"గుడ్ బోయ్! రెండు రెళ్ళు నాలుగు అని ఎప్పటికీ ఎలా మర్చిపోలేమో, అలా ఏ వస్తువు అక్కడే ఉండాలి అనే సూత్రాన్ని కూడా మర్చిపోకూడదు. ఇప్పుడు చూడండి. మీరు సుగంధాలతో నలుడు, నలకూబరుల్లా ఎంత ఘుమఘుమలాడుతున్నారో?"

"వాళ్ళెవరూ?" అనుమానంగా చూసాడు.

"ఓ! మీరు లెక్కల్లో తప్పించి అన్నిట్లో వీక్ కదా? ఒకరు చక్రవర్తి, ఒకరు గంధర్వుడు."

"ఓహో! తమరు వెళ్ళి ఆ సుగంధాలు ఆఘ్రాణించి వచ్చారు" ఉక్రోషంగా చెప్పాడు.

చిన్నగా చప్పట్లు కొడుతూ చెప్పింది శృతి.

"శభాష్, మీకు శుభ్రతతో పాటు కాస్తంత భాషాపరిజ్ఞానం కూడా అబ్బిందండోయ్"

●●●

"శృతీ. ఆఫీస్‌కి వెళుతున్నాను. తలుపేసుకో" గుమ్మంలోకి వచ్చిన కృష్ణ ఎదురింటి వైపు చూసి నిరసనగా చెప్పాడు.

"పాపం ఆ మానవుడు పొద్దున్నే పడుతూ లేస్తూ డ్యూటీకి వెళ్తాడు. ఈవిడేమో ఆయన వెళ్ళగానే ఇలా ఫోన్ పట్టుకుని బాయ్ ఫ్రెండ్‌తో మాట్లాడుతూంటుంది. సాయంత్రందాకా ఇష్టారాజ్యం కదా? ఏమైనా చెయ్యచ్చు."

"కృష్ణా" చురుగ్గా చూసింది శృతి.

"రోజూ ఈ టైంలో అమెరికా నుంచి వాళ్ళక్కయ్య కాల్ చేస్తుంది. ఆ కాల్ అయ్యాక ఇక తను తన పని చేసుకుంటుంది. రోజంతా ఏం మాట్లాడదు."

"ఆవిడ చెప్పింది. నువ్వు నమ్మావు. అంతే. కానీ అది ఖచ్చితంగా బాయ్‌ఫ్రెండ్ నుంచి వచ్చిన ఫోనే. ఎంతనవ్వుతూ మాట్లాడుతోందో చూడు." నమ్మకంగా చెప్పాడు కృష్ణ.

"బాయ్ ఫ్రెండ్ కాల్‌ని ఎవరూ తలుపు తీసి మాట్లాడరు కానీ, మీకు టైం అవుతోంది వెళ్ళండి." అతన్ని పంపించి తలుపులు మూసి సోఫాలో కూలబడింది శృతి.

"మనిషిని శుభ్రం చేయడానికి ఇంతకాలం పట్టింది. ఇక మనసుని శుభ్రం చేయడానికి ఎంతకాలం పడుతుందో!" నిస్పృహాయంగా అనుకుంది.

****

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story